# సినీ బేతాళ కథలు

- డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 36 -

## - మూడాచారం -

**విక్రమార్కుడు మళ్లీ** బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రమార్కా! దారిలో నీకు నడకబోరు తగ్గించడానికి మరో కథ చెబుతాను విను-' అని బేతాళుడు ప్రారంభించాడు.

నిర్మాత కుచేలరావు గ్లాసులో ఐసు ముక్కలు వేసుకుని విస్కీపోసుకున్నాడు. 'అలా యెందుకండీ అపురూపమైన మందుని రాళ్లపాలు చేస్తున్నారు' అనడిగింది అతని భార్య రంగసాని..

'రాళ్లపాలు చెయ్యడం కాదే రంగప్యారీ! ఆన్ ద రాక్స్ అలంకరిస్తున్నా- అది సరేగానీ నిన్న ఆ మ్యూజిక్కాడు కట్టిన మనకొత్త సినిమా పాట వొకసారి ఆన్ చెయ్యి" అన్నాడు.

రంగసాని పాట ఆన్ చేసింది. ఆ పాట జపాన్‌లో వున్న ప్రియురాలికోసం విశాఖలో విరహప్రియుడు పాడింది - ఒసాకాలో వొంపుల పిల్లా, విశాఖలో జంపులు ఎల్లా? ఒసాకాకి ట్రిప్పేద్దామా, కసిదుప్పటి కప్పేద్దామా -

పాట విన్నాక గ్లాసుకేసి చూస్తూ నిర్మాత కుచేలరావు - 'సావిత్తెం యిరగదీసాడు కవిగాడు. రాగం బోగం సేసాడు మూజిక్కాడు. సూసావా రంగీ.. గలాసులో ఐసు ముక్కలు యెలా కరిగిపోతున్నాయో - అందుకే అన్నారు. సంగీతానికి రాళ్లు కరుగుతాయని.' అన్నాడు.

'ఎదవ జడ్జిమెంట్లుసైమాకండి. ఏ యెదవ రాసినా, ఏ సన్నాసి టూనిచ్చినా యినే వోడి సెవుల్లో తెలుగెప్పుడో బీటలు తీసింది. ఐసురాళ్లు కరగటానికి పాటెందుకూ? మీ సుక్క సూపు సాలు' అంది నిర్మాత భార్య రంగసాని.

మర్నాడు పాటల రచయిత గీతగోవిందం, నిర్మాత కుచేలరావుని ప్రొడక్షనాఫీసులో కలిశాడు.

'పస్టు సాంగు ఫస్టుగా వుందయ్యా గోయిందం. మరి రెండోది రెడీనా?' అడిగాడు కుచేలరావు.

'ఆమ్యామ్యా - అషుంభుషుం' - అన్నాడు లిరిగ్గోవిందం.

'ఏటిది - పల్లవా?' - అడిగాడు నిర్మాత.

'పల్లవీ - పాటా కాదండి. ఆమ్మ్యామ్యా - అషుంభుషుం!'

'పల్లవీ - పాటా కాకపోతే ఏటిదీ! ఆమామా - అసుం బుసం'

'అదేనండి. కాస్త డబ్బుకి యెటాముటీగా వుందండి. మొహమాట పడి అలా అడిగానండి.'

'బలేవోడివయ్యా కవీ! డబ్బెక్కడికి పోద్ది? నీకు తెల్సా ఏటి? నేనా కుసీలుడు. లోబడిజట్టు పూరు నిర్మాతగాణ్ణి. నువ్వా గోయిందం. గోయిందుడు. కుచేలున్ని డబ్బడగటం పరాసికంగా లేదూ?'

'అదేంటిసార్ - హీరో, హీరోయిన్లకి కోట్లు కుమ్మరిస్తారు. పాటల రచయితకి చిల్లర చిలకరిస్తారు. పాటలు బావుంటేనే కదా సినిమా నిలబడేది! '

'నిజమేలే. కానీ ఆల్ల రేటదీ - ఏంసైను సెప్పు!' అయినా అలాంటిదేం ఎట్టుకోకు. నీకు మిగతా నిరమాతగాల్లకంటే ఎక్కువే యిస్తాను. ఎందుకంటే నేను సావిత్తిపియున్ని. అంచాత ముందింటికెల్లి ఆ రెండో పాట రాసేసి తీసుకురా -'

'సర్లెండి. రెండ్రోజులు పట్టేలావుందండి.'

'ఎందుకో?'

'ఏంలేదండి. మూడ్ మూలకెల్లిపోయిందండి. ఎలాగో ట్రై చేసి రెండ్రోజుల్లో మూడ్ తెచ్చుకుని రాస్తానండి'

'సూడు. నా పాటగోయిందం! మూడనేది ఎక్కడో అనకాపల్లినుంచో, పెద్దాపురం నుంచో రాదు. మనం తెచ్చుకోవాల. '

'ఎలాగండి తెచ్చుకోవడం?'

'యిను. నేనో నికార్సయిన సలహా యిస్తాను. అలా సెయ్యి. మూడేటి - దానమ్మా మొగుడు కూడా లగెత్తుకొత్తుంది.'

'అయితే చెప్పండి సార్!' - ఆత్రుతగా అడిగాడు గీత రచయిత గీతగోవిందుడు.

'ఏటుంది. బాగా సింపుల్. యింటికెల్లి పెల్లాన్ని పలకరించు. పేమగా డవిలాగులు సెప్పు. యింకా పేమగా దగ్గరికి తీసుకో. ఆలీసం సైకుండా యిద్దరూ కలిసి మంచమెక్కి, మంచాన్ని కోల్లు యిరిగేలా కుదిపెయ్. మూడు, రెండు సెకన్లలో రన్నింగ్సుతో వొచ్చి నీకు మూడు రాజుకుంటుంది. నీ కలం రాసుకుంటుంది.'

'అంతేనంటారా!'

'అంతే ఏంటి! యిది యేదం. పాలో అయిపో. పాటతో వొచ్చెయ్. రెండురోజులు నేను నా కొత్త అవుడ్డోరు కోసం అలా డార్జిలింగ్ ఎల్లొస్తా' లిరిగ్గోవిందానికి ప్రోత్సాహరసం పోసి పంపించాడు.

❦❦❦

నిర్మాత కుచేలరావు డార్జిలింగ్‌నుంచి తిరిగొచ్చాడు. పాటల రచయిత గీతగోవిందం డార్లింగ్‌ను కలిసి తిరిగొచ్చాడు.

'ఏటి గోయిందం! నే సెప్పినట్టు సేసేవా! మూడు సెట్టయ్యిందా! పాటచ్చరాలు కట్టేసావా!' అని కుచేలరావడిగాడు.

విరిగ్గోవిందుడు చురుగ్గా సమాధానం చెప్పాడు - 'యస్సార్! మీ సలహా మహత్తరం. పాటించాక నాకొచ్చిన మూడు గురించి నావల్లకాదు చెప్పతరం. ఇదిగో నేను మాంఛి మూడులో రాసిన రెండోపాట.' అని పాట వినిపించాడు. పాట చూసి కుచేలరావు ఖుషీ అయిపోయాడు' నువ్ మాంచి పాటకారివయ్యా గోయిందం!' - అని మెచ్చుకున్నాడు.

గీతగోవిందుడు ఆనంద సముద్రంలో ఈతకొడుతూ అన్నాడు. 'సార్! డబ్బులడిగినపుడల్లా మీరు కుచేలుడిని అంటారుగనీ, మీ యిల్లు మాత్రం అదిరింది సార్. ముఖ్యంగా మీ బెడ్‌రూమ్ స్వర్గతుల్యం. ఆ బెడ్ మన్మధ భరితం'

'గోయిందా - గోయిందా. పెళ్లాన్ని పలకరించమంటే నీ పెళ్లాన్ని కులుకుసైమని.'

'నాకింకా పెళ్లికాలేదు సార్! మీరు నా పాటల కిచ్చే చిల్లరతో వొక్కణ్ణీ బతకడం కష్టం - యిక సంసారం యెలా చెయ్యగలను సార్!'

అంతే నిర్మాత కుచేలరావు - 'రంగసానీ!' అని ఓ గావుకేక పెట్టి మందుబీరువా కిందపడిపోయాడు. -

'అదీ విక్రమార్కా! ఇప్పుడు చెప్పు! తర్వాత ఏం జరిగింది? ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ బదులు చెప్పకపోయావో నీ తలమీద వెయ్యి కొత్త తెలుగు సినిమా పాటలు గీతగోవిందం వాయించేస్తాయి.' అని బేతాళుడు ముగించాడు.

జవాబుగా విక్రమార్కుడు. 'ఓ బేతాళా జరగడానికేముంది. రంగసానికి పుట్టిన కొడుకుని కుచేలరావు, గీత రచయిత గీత గోవిందుడు - నా కొడకా! నా కొడుకా! అని ప్రేమగా పిలుచుకోసాగారు. నిర్మాతలు లిరిక్ రైటర్స్‌కి రేటు బాగా పెంచారు కానీ యింకా క్రియారూపంలోకి దించలేదు. అందుకే -

-కాయేన మనసా బుద్ధ్యా

కెవలై రింద్రియై రపి!

యోగినః కర్మకుర్వస్తి

సంగత్య క్త్వా ఆత్మశుద్ధయే!!

లిరిక్కృతులైన యోగులు ఆత్మ పరిశుద్ధికి స్వర్గోద్రిక్త ఫలాశను ఆశింపక తను మన జ్ఞానేంద్రియములతో కర్మల నాచరింతును - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు."

- అని చెప్పగానే, రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు యెగిరి మళ్లీ, తెలుగు సినిమా పాటలా అనూహ్యంగా పెరుగుతున్న చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments